# చేతులు కాలాక...

-డా॥ టి. రంగస్వామి

విచలిత హఠాత్తుగా మంచంమీది నుంచి లేచింది. బయట వినపడుతున్న అరుపులకు తృళ్ళిపడింది. తను ఇప్పుడే బడి నుండి వచ్చింది. అలసటగా ఉండడం వలన మంచంలో ఒరగడము, కునుకు పట్టడము రెండూ అయినవి.

"ఒసే! వస్తున్నావా!... దొంగముండా! కుళ్ళు వోతుదానా! ఇటు రావే!'' అంటూ బయట అరుస్తున్నది.

"అమ్మా! లోపలకి రా! ఏమైంది! ఎందుకా అరుపులు!" అంటూ వచ్చింది విచలిత.

"నీకు అరుపులు లాగే అనిపిస్తాయి. ఉదయం అనగా వెళ్ళానా! కనీసం అమ్మ ఎప్పుడు వస్తుందో! ఎదురు చూద్దాము అనేది లేదు".

"ఎందుకే! అలా అంటావు. నేను ఇప్పుడు వచ్చిన బడి నుండి అక్కడ అరచీ అరచీ వచ్చి ఇలా మంచంలో కూలబడ్డాను. కునుకు పట్టింది.

"కునకు పడతది... పడతది... ఎందుకు పట్టదు... నీవు ఏదో సంపాదించి మా మొకాన పోసినట్టు..."

"అమ్మా! లోపలికి రా... నేను ఏమన్నానని...! ఎవల్లకు నా మాటలు పట్టయ్! ఆ పోరడు గింతంత లేదు! ఇంటర్ చదువుతున్నానని ఒకటే తలపొగరు! నా మాటలింటాడు... అంటే అసలే వినడు".

''అమ్మా! ఇగో మంచీల్లు. తాగి మొఖం కడుక్కునిరా!" అంటూ గ్లాసందించి పోయింది విచలిత.

విచలిత మనస్సు అంతా గందరగోళంగా వుంది. ఒక్క ఆలోచన కూడా స్థిరంగా ఉండడం లేదు. బడికి పోయినా! ఇంటికి వచ్చినా! రాత్రి నిద్రపోయినా మనసు స్థిమితంగా ఉండడం లేదు. ఆలోచనలు తేనెటీగల పుట్టను కదలించినట్టుగా నిశ్శబ్దంగా అలజడిని కలిగిస్తున్నాయి. ఈ అలజడి నుండి ఎలా తట్టుకోవాలి? మనసులో రేగుతున్న వుండు హిమజ్వాలలా మండిస్తున్నది. ఇది అనుక్షణిక మవుతున్నది.

నిన్నటికి నిన్న... ఆలోచనల పద్మవ్యూహము నుండి బయట పడటానికి అన్నట్టుగా, ఎవరూ లేని నాకు... ఉన్న ఒక్క తమ్ముడిని చూసి వద్దామని హాస్టల్‌కు వెళ్ళితే! "అక్కా... నీవు తప్పు చేసావేమో ననిపిస్తుంది! మన అమ్మ తన మొండి పట్టే తప్పు... మనసు ప్రశాంతంగా ఉండనీదు. తన ఆలోచనలకు మనల్ని బలిచేస్తున్నదేమో! ఆలోచించు. నేనైతే ఊళ్ళో ఉండి కూడా చదువు వంకతో అమ్మ నుండి రక్షించుకుంటానికే హాస్టల్‌లో పడ్డాను... నీ కాళ్ళ మీద నిలబడే శక్తి నీకు ఉన్నది. ఇప్పుడు నీవు ఉద్యోగస్తు రాలివి. నీ మార్గములో నీవు పయనించడానికి ఎందుకు వెనకడుగు వేస్తున్నావు" అంటూ ప్రశ్నిం చాడు. వాడు చిన్నవాడైనా వాని ఆలోచనలలో విచక్షణ కనిపిస్తున్నది. నాకు ఎందుకు కనిపించడం లేదు మార్గము... ఏదైనా చేద్దామని నిర్ణయించుకున్నా, అమ్మ దగ్గరకు వచ్చేసరికి ఆ నిర్ణయాలన్ని ఫటాఫట్ అవు తున్నాయి. వాడంతటితో ఆగకుండా ఇంకో మాట కూడా అన్నాడు. అది... అది... ఏమిటంటే... "అమ్మ మనకు మంచి చేస్తున్నాననుకుని, తను నిర్ణయం తీసుకున్న ఆలోచనలకు బలి చేస్తున్నది. నీవూ ఆలో చించు?" నిజంగా వాడు ఎంత తొందరగా జాగ్రత్త పడ్డాడు.

మొన్నటికి మొన్న... నాన్న... ఏమన్నాడు? "చూడు బిడ్డా! నేను ఉద్యోగం చిన్న పల్లెటూళ్ళో చేస్తున్నాను. పట్నంలో ఉండాలని అంటే మన తాహతుకు మించినది. మీ అమ్మ కోరిక మేరకు పట్నంలో ఇల్లు తీసుకున్నాను. మీరు చదువుకుంటా రని. అంతేకాదు పట్నంలోని జీవ వైవిధ్యాలను, గమనాలను అక్కడి వ్యక్తులను చూసి కనీస మర్యాదలు నేర్చుకుంటుందని, తాను మారుతుందని భావించాను. అంతా వృథా అయింది. మారుమూల అడవుల్లో నుండి వచ్చిన తను, తనవారంటే ఏహ్యా భావమును ఏర్పరచు కుంది. తనకంటే అధికులు, తెలిసిన వారలు లేదనుకుంటుంది. ఇవన్నీ గమనించే నేను "ఊర్లోనే ఉద్యోగమును చేసుకుంటున్నాను. మనసుకు కొంతైన ప్రశాంతత దొరుకుతుందని. పదిహేను రోజులకో, నెలకో వచ్చిన ఒక రోజు ఏదో విధముగా గడుపుకొని వెళ్ళడమును అలవాటు చేసుకున్నాను. దాని మాట విన్నట్టు నటించడమే తప్ప నాకు మిగిలింది ఏమీ లేదు. ఇక ఈ జీవితానికింతే! మీరైనా ముందు జాగ్రత్తతో ఉండండి, జీవించడం వేరు, జీవించినట్టు బ్రతకడం వేరు. మీ అమ్మ ముందట నేను తన మాటకే వత్తాసు పలుకుతాను, లేకపోతే అది ఇల్లు పీకి పందిరి

వేస్తుంది. అందువలన... నీ విషయంలో నీవే ఆలోచించు. పరోక్షముగా నా సహకారమూ ఎల్లప్పుడు ఉంటుంది" అని అన్నాడు అంతేకాదు "నాకు ఉద్యోగమున్నది... నీ కాళ్ళ మీద నిలబడే శక్తి నీకున్నది! ఇతరులకు కూడా చేయూతనిచ్చే స్తోమత నీకు భగవంతుడు ఇచ్చాడు. నీవు ఏ నిర్ణయం తీసుకున్నా పూర్తి బాధ్యత నీదే" అంటూ వెళ్ళిపోయాడు.

నాన్న చెప్పినట్టుగానే! అమ్మ ముందట నేను ఏమీ చేయలేక పోతున్నాను? ఎందుకు?...

ఈ రోజు బడిలో సునంద టీచర్ ఎలా మాట్లాడింది. మిగతా సార్లు నా వెనుక, చాటుమాటున నా గురించి చెడ్డగా చెప్పుకుంటున్నారు. అయినా పట్టించుకోలేదు. కానీ సునంద టీచర్ మాత్రం తాడే, పేడో తేల్చుకోవాలన్నట్టుగానే మాట్లాదింది.

సునంద టీచర్ చాలా మంచిది. తను ఇద్దరు పిల్లల తల్లి. ఎప్పుడూ నవ్వుతూ హాయిగా మాట్లాడుతుంది. తన మాటల్లో వెన్నెల్లో సేదతీరినట్టుంది. ఎండన పడి వచ్చాక చల్లటి మంచినీళ్ళు తాగినట్టుగా ఉంటుంది ఆవిడ చిరునవ్వు. ఆమె స్నేహంలోని మధిరమ ఎప్పుడూ మల్లెపూల సౌరభంలా ఎదఎదను తాకుతుంది. నా ఉద్యోగ జీవితంలో ఆమె పరిచయం మంచి గంధం లాంటిది. అలాంటిది ఇవ్వాళ కటువుగా మాట్లాడింది. నిజమే మరి! తను చేస్తున్న పని గొప్పదా! ఒక్కొక్కసారి నా మీద నాకే అసహ్యం వేస్తున్నప్పుడు? సునందలాంటి టీచర్ ఇన్ని రోజులు ఓపిక పట్టడమే ఆశ్చర్యం.

మల్లేశం సార్! నేను లేననుకున్నాడేమో! మిగతా సార్లతోని "మన విచలిత మేడం భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నది. అంత మూర్ఖంగా ప్రవర్తించడం ఏ మాత్రం బాగా లేదు. అప్పుడేమో సుమంత్‌సార్ వెంబడి పడి చేసుకున్నది. ఇప్పుడేమో అంతగానే వెంబడి పడి, వేధించి విడాకుల కొరకు తిరుగుతున్నది. ఈ టీచర్‌కు అన్నింటికీ తొందరే. తెలివిలేదా అంటే పుష్కలంగా ఉన్నది. మన స్కూల్లో ఆమెను చూస్తలేమా! కాని తన జీవితంలోనే తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నది. కనీసం ఎవరి సలహానైనా తీసుకోవచ్చును కదా! ఆమెకు జీవితం నవ్వులాటగా ఉంది. మన మండలం టీచర్లందరిలో కూడా విచలిత మేడం చర్చనీయాంశమైంది. ఈమె ప్రవర్తన మంచిదైనా అభాండాలకు అవకాశము కల్పిస్తున్నది. "సునంద టీచర్ మీరైనా చెప్పండి. మన మనిషి అనుకున్నప్పుడు తప్పుడు నిర్ణయం తీసుకుంటున్నప్పుడు చూస్తూ ఊరుకోవడం భావ్యం కాదేమో! ఆమెకు కోపం వస్తే రానీయండి. ఒకసారి గట్టిగా మందలించండి" అని అన్నాడు.

ఆ పూట ఆమె మాట్లాడలేదు. కాని... నేను ఒంటరిగా దొరికినప్పుడు అనాల్సిన మాటలన్నీ అని, "నీవు అతని వెంబడి పడి, ప్రేమించి, ఒప్పించుకొని పెళ్ళి చేసుకొని, ఇప్పుడిలా చేయడం ఏమీ బాగాలేదు. జీవితం బొమ్మలాట కాదు కదా! అతను కూడా సౌమ్యుడే కదా! మీ అమ్మ కోరినట్టుగా ఆ ఇంటి నుండి, తన వాళ్ళందరిని వదిలి పెట్టి రాకపోవడమే అతని తప్పా! ఒక్కగానొక్క కొడుకు అయిన అతను తల్లిదండ్రులను ఎలా వదిలి పెడతాడు? మీ అమ్మ అన్నంత మాత్రాన నీ విచక్షణ జ్ఞానం ఎటు పోయింది! నీవే ఎన్నోసార్లు నాతో అన్నావు, మా అమ్మ రాక్షసి నుండి పారిపోవాలని ఉందని! అటువంటప్పుడు ఈ ఆలోచన ఎందుకు! అతని అక్క చెల్లెండ్లు అందరూ ఎవరికి వారు బతుకుతున్న వారే కదా! ఉద్యోగం చేసుకుంటున్న వారే కదా! మీ ఆయన మీద బరువు బాధ్యతలు ఏమీ ఉండవు కదా! మీరిద్దరూ ఉద్యోగస్తులేనాయె! నీవే అన్నావు కదా! మా ఆడబిడ్డలు మంచి వాండ్లేనని, నన్ను తోబుట్టువులా ఆదరించారని, పెండ్లి అయి రెణ్ణెల్లు కాలేదు! అప్పుడే ఇలా ప్రవర్తిస్తే ఎలా! మీ కుటుంబ సంప్రదాయంలోనూ ఆచార వ్యవహారాల్లో విడాకులు పొందడం సులభమే కావచ్చు. కాని దాంపత్య జీవనములో అది గొడ్డలి పెట్టు అవుతుంది. వెనుకటి కాలంలో నాగరికత పెరగని సమాజంలో చదువు, ఉద్యోగాలు లభించని పరిస్థితులలో అది సరిపోయింది. ఇప్పుడలా కాదు! నీవు రెండో పెళ్ళి చేసుకోగలవా! చేసుకున్నా వచ్చినవాడు ఆదరించగలడా! ఆలోచించు. ఇంకా సమయం మించి పోలేదు. మీ అమ్మను పక్కకు పెట్టు మనను కానీ, ఆమె ఆలోచనలకు అవకాశమివ్వకు. నీ జీవితం గురించి ఆలోచించు. ఇంకా సమయం మించి పోలేదు. జరిగిందంతా పీడకలలా మరిచిపో! ఒక పొరపాటును దిద్దుకోవడానికి అనేక మార్గాలు ఉంటాయి. వెలుగుదారుల్లో పయనించడానికి ఆలస్యం చేయకు. నీ వెనుక మేముంటాము అని" అంది మేడం సునంద.

అమ్మా! సమ్మక్కా! మా ప్రాంతదేవతా! ఇలవేలుపు అయిన నీవే మాకు రక్ష. సునంద టీచర్ చెప్పినట్టుగానే రేపే వెళ్ళి ఆయనను కలుస్తాను... క్షమాపణ అడుగుతాను.